తాగునీటి పైప్‌లైన్‌ను పొడిగించాలి



జీఎం బలరాంకు వినతిపత్రం ఇస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో ప్రజల అవసరాల మేరకు తాగునీటి పైప్‌లైన్ పొగించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జలమండలి జీఎం బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్‌లో తాగునీటి సమస్యలు ఉన్నాయని రాజీవ్ గాంధీనగర్ ఫేస్–1 లో నూతన నీటిలైన్ ఏర్పాటు చేయించాలని కోరారు. వినాయక చవితి రానున్న నేపథ్యంలో డివిజన్ పరిధిలో నూతన డ్రైనేజీ లైన్ పనులు చేసి రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెంటనే ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. మ్యాన్‌హోళ్లు కుంగిపోతున్నాయని వాటి స్థానంలో నూతనంగా ఏర్పాటు చేయాలని వినతిలో కోరారు.

మురుగు సమస్య రానివ్వొద్దు



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

సైదాబాద్: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మురుగు సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆమె జలమండలి అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి రెవెన్యూ బోర్డు, ఏపీఏయూ కాలనీల్లో పర్యటించారు. రెండు కాలనీల్లో డ్రైనేజీలు నిండి మురుగు రహదారులపై పారుతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు కార్పొరేటర్‌కు దృష్టికి తీసుకురాగా డ్రైనేజీలు ఓవర్‌ఫ్లో కాకుండా చూసుకోవాలని అవసరమైన వాటికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం శ్యాంసుందర్ నాయక్, డీజీఎం నాగరాజు, మేనేజర్ శ్రవణ్‌కుమార్ సిబ్బంది, పలువురు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం అందజేత



చెక్కును అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

వనస్థలిపురం: నల్లగొండ జిల్లా నర్సింహులగూడెం గ్రామానికి చెందిన కొసనం శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం వనస్థలిపురం వనస్థలి హిల్స్ కాలనీలోని రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌ను మిత్రులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధుల బాగోగులను విచారించి వారి సౌకర్యార్థం రూ. 50 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాకేష్‌రెడ్డి, శశాంక్‌రెడ్డి, శ్రీను, ఎస్.కిరణ్, చెన్నకేశవ, అనిల్ కుమార్, గోవర్ధన్‌రెడ్డి, సైదులు, సాయి, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

సైదాబాద్: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ సూచించారు. మంగళవారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు ప్రభుత్వ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. గణేష్ ఉత్సవ సమితి సభ్యులు గణేష మండపాల నిర్వాహకులు, పోలీసులకు వారధిగా నిలవాలని పోలీసుల అనుమతులు తీసుకున్న ప్రతీ మండపం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. గణేష్ విగ్రహాల సామూహిక నిమజ్జన యాత్ర పూర్తయ్యే వరకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


పుల్లూరి ఫౌండేషన్ చేయూత



చెక్కు అందజేస్తున్న ఉపేందర్‌గుప్తా

సైదాబాద్: పేదరికం కారణంగా ఎవరూ చదువును ఆపరాదని పుల్లూరి అనంత లక్ష్మి ఫౌండేషన్ చైర్మన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ బంజారా–320డీ రీజియన్ చైర్మన్ పుల్లూరి ఉపేందర్‌గుప్తా అన్నారు. సరూర్‌నగర్ పీఅండ్‌టీ కాలనీకి చెందిన కరాటే మాస్టర్ తీగల శ్రీనివాస్ రెండు కిడ్నీలు చెడిపోవడంతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్నాడు. ఆర్థిక సమస్యలు తలెత్తడంతో అతని ఇద్దరి కుమార్తెలు చదువును ఆపాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న ఉపేందర్‌గుప్తా, లయన్స్ క్లబ్ సభ్యుడు జె.మురళీకృష్ణ మంగళవారం తీగల శ్రీనివాస్ అతని ఇద్దరి కుమార్తెలను కలిసి వారి చదువు కోసం రూ. 20 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పుల్లూరి చరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు

నిధుల మంజూరుకు వినతి



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని కాలనీల సమస్యలు పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో మౌలిక వసతులు లేక కాలనీల వాసులు ఇబ్బంది పడుతున్నారని వాటి పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని వినతిలో కోరారు.

రోడ్లపై గుంతలు.. అధికారుల కళ్లకు గంతలు



వర్షాల కారణంగా డివిజన్‌లోని పలు కాలనీల్లోని రోడ్లు ధ్వంసమవుతున్నాయి. సరూర్‌నగర్ పోస్టాఫీస్ నుంచి గ్లోబల్ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు, స్కూప్ ఐస్‌క్రీం వద్ద భారీగా గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నెలవుగా మారాయి. ఇదే ప్రాంతంలో మూడు నెలల క్రితం రోడ్డుకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేశారు. ఇలా ఇక్కడ పలుమార్లు మరమ్మతులు చేస్తున్నా పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఏకధాటిగా కురుస్తున్న నేపథ్యంలో రోడ్లపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

-లింగోజిగూడ

పర్యవేక్షణ కరువు.. నిరంతరం వెలుగు



జైపురికాలనీలో వీధి లైట్లపై పర్యవేక్షణ లేక నిరంతరం వెలుగుతుండటంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. రాత్రి వెలిగి ఉదయం ఆఫ్ అయ్యేలా చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. వీధి లైట్లకు సంబంధించిన బాక్సులు పనిచేయకపోవడంతో గత ఆరు నెలల నుంచి రాత్రీపగలు తేడా లేకుండా వెలుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ వృథాను అరికట్టాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

-నాగోలు

శానిటేషన్ విషయంలో నిర్లక్ష్యం తగదు



శంకర్‌సింగ్

చాదర్‌ఘాట్: శానిటేషన్ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని చార్మినార్ జోన్ డిప్యూటీ కమిషనర్ శంకర్‌సింగ్ హెచ్చరించారు. మంగళవారం మలక్‌పేట సర్కిల్–6 కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చార్మినార్ జోన్ పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో ఎక్కడైన చెత్తకుప్పలు ఉన్నాయని ఫిర్యాదు వస్తే ఆ ప్రాంత ఏఎమ్‌హెచ్‌ఓపై వేటు వేస్తామన్నారు. ప్రతీరోజు ఒక్కో నియోజకవర్గంలో పర్యటిస్తామని గణేష్ ఉత్సవాలతో పాటు వరదల్లో కొట్టుకొచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా 99857 82333 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తా

ఎంపీ ఈటల రాజేందర్

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు మంజూరు చేసి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని కుమ్మరి బస్తీలో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మారుతీనగర్ కాలనీ వాసులతో కాలనీ సమస్యల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. త్వరలో కాలనీలో ఎంపీ నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సామ రంగారెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, సిల్వేరి అనిల్‌కుమార్, పాశం శ్రీశైలం, శేఖర్, రాంపురం శ్రీనివాస్, శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.



భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

వరద బాధితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ నేతలు

మన్సూరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వర్షాలతో చెరువులకు గండ్లు ఏర్పడి వరదలతో రాష్ట్రం అతలాకుతలం అయ్యిందని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించి, రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ఆర్థిక సహాయం ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రచారి, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. హయత్‌నగర్ మండల పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భారీ వర్షాలతో రాష్ట్రంలో రవాణా వ్యవస్థతో పాటు పంటపొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఇప్పటికి అనేక గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయని, వారికి నీళ్లు, ఆహారం అందించడంతో పాటు అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాని కోరారు. వరదల్లో నష్టపోయిన కుటుంబాలకు ఆదుకోవాలని మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు.

చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ హైడ్రా కమిషనర్‌ను రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కిగౌడ్ మాట్లాడుతూ.. హస్తినాపురంలోని చేపల చెరువు నామరూపాలు లేకుండా పోయిందని, బైరామల్‌గూడ చెరువు ఆరు ఎకరాలు ఉండాల్సింది రెండు ఎకరాలు మాత్రమే మిగిలిందన్నారు. సాహెబ్‌నగర్ కాప్రాయి చెరువు 40 ఎకరాలకు 12 ఎకరాలు మాత్రమే ఉందని ఆరోపించారు. 2020లో కురిసిన వర్షాలతో చెరువుల వాస్తవ ఎఫ్‌టీఎల్ పరిధి తెలిసిందని పేర్కొన్నారు. పలు చెరువుల వద్ద ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌లను తొలగించి ఆక్రమణలపై పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

పొంగుతున్న డ్రైనేజీలు.. పట్టించుకోని అధికారులు

దిల్‌సుఖ్‌నగర్: గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మలక్‌పేట్‌జోన్ పరిధిలోని కాలనీలో నాలాలు పూడుకుపోయి మురుగునీరంతా రోడ్లపై కాలనీల్లో ప్రవహిస్తోంది. నాలాలలో ఎప్పటికప్పుడు పూడిక తీయకపోవడంతో కాలనీలు, బస్తీలు ముంపునకు గురవుతున్నాయి. రోడ్లపై పారుతున్న మురుగు నీటితో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఓల్డ్‌మలక్‌పేట్, ఎన్‌టీఆర్‌నగర్, సరూర్‌నగర్ అక్బర్‌బాగ్, మూసారంబాగ్, సైదాబాద్, కుర్మగూడ తదితర డివిజన్లలో డ్రైనేజీ పైపులు లీకై డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయి. పూడికతీత పనులను చేయక పోవడంతో పైపులైన్లలో చెత్త చెదారంతో నిండి మురుగు, వర్షంనీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఔషధాల అభివృద్ధిపై జాతీయ సెమినార్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ రబి నారాయణ

సైదాబాద్: సాంప్రదాయ వైద్యంలో ఔషధాల అభివృద్ధిపై రెండు రోజుల జాతీయ సెమినార్ ప్రారంభమైంది. సైదాబాద్ డివిజన్ రెవెన్యూ బోర్డ్ కాలనీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్‌లో మంగళవారం ప్రారంభమైన ఈ సెమినార్‌ను సీసీఆర్‌ఏఎస్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ రబినారాయణ ప్రారంభించారు. సాంప్రదాయ వైద్య వ్యవస్థలలో కొత్త ఔషధాలను అభివృద్ధి చేయడంలో తాజా పురోగతి, అందుకు సంబంధించిన భవిష్యత్ ప్రణాళికలను ఈ సెమినార్‌లో చర్చిస్తారని నిర్వాహకులు తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ పరిశోధకులు, ఆయుర్వేద వైద్యులు, శాస్త్రవేత్తలు ఒకే వేదికపైకి చేరుకొని విన్నూత్న పరిశోధన, ఆధునిక పద్ధతుల సమన్వయం, నియంత్రణ సవాళ్లు, పరిష్కారాల గురించి చర్చిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఆర్‌ఏఎస్ డిప్యూటీ డీజీ ఎస్.శ్రీకాంత్, సంస్థ ఇన్‌చార్జ్ డాక్టర్ జీపీ ప్రసాద్, సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బైరామల్‌గూడ చెరువు సర్వే



చెరువును సర్వే చేసేందుకు వచ్చిన అధికారులు

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ చెరువు కబ్జాకు గురైందని స్థానిక డివిజన్ వాసులు అలె వెంకట రెడ్డి, సునీల్ ఆధ్వర్యంలో హైడ్రా అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం సంబంధిత అధికారులు చెరువును సర్వే చేశారు. అనంతరం అలె వెంకట రెడ్డి మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డుల ఆధారంగా చెరువు విస్తీర్ణం 6 ఎకరాల 20 కుంటలు ఉండగా ప్రస్తుతం నాలుగు ఎకరాల లోపే ఉందని ఆరోపించారు.

మట్టికి జై కొట్టి

- పర్యావరణహిత విగ్రహాలు తయారీ
- ఆసక్తి కనబరుస్తున్న నిర్వాహకులు
- జోరందుకున్న విక్రయాలు



తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు

వివిధ రూపాల్లో విగ్రహాలు

మన్సూరాబాద్: ఆధునికత పేరుతో మనిషి చేస్తున్న తప్పులతో పర్యావరణం దెబ్బతింటుంది. అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే వి నాయక చవితిలో విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారుచేసి రసాయనిక రంగులు అద్దు తుండటంతో పర్యావరణం కలుషితమవుతుంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయక విగ్ర హలను నిషేదిద్దాం.. మట్టి వినాయకుల విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షించుకుందాం అంటున్నారు పర్యావరణ ప్రేమికులు.

కోల్‌కతా కళాకారులతో..

పర్యావరణానికి అనుకూలంగా మట్టి వినాయకులనే పూజిద్దామనే ప్రచారం విస్తృతస్థాయిలో చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న ప్రచారంతో ప్రజల్లో చైతన్యం పెరిగి మట్టి ప్రతిమలకు డిమాండ్ పెరిగింది. డిమాండ్‌కు అనుగుణంగా మన్సూరాబాద్ డివిజన్ వినాయక్‌నగర్‌కాలనీలోని శ్రీజయ హనుమాన్ ట్రేడర్స్‌ను ఏర్పాటు చేసిన నాంపల్లి హనుమంతు కోల్‌కతా కళాకారులతో మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాడు. మూడు, నాలుగు నెలలుగా విగ్రహాలను వివిధ రూపాల్లో ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. భక్తులు ముందుగా ఆర్డర్ చేసినట్లయితే వారికి నచ్చిన రూపంలో మట్టి విగ్రహాలను వారికి అందుబాటులో ఉండే ధరతో తయారు చేసి ఇస్తున్నారు. చిన్న విగ్రహాల నుంచి 6 అడుగుల వరకు అందుబాటులో ఉన్నాయి. ప్రతిమల తయారీకి కోల్‌కతా గంగనది బంకమట్టి, వాటర్‌కలర్స్‌ను మాత్రమే ఉపయోగిస్తున్నారు. మట్టి విగ్రహాలు కావాల్సిన వారు 9848482929 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జాగృతి ఆధ్వర్యంలో 16 ఏళ్లుగా..

వనస్థలిపురం: గణేష్ నవరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో కాలనీలు, బస్తీల్లో పండగ కోలాహలం మొదలైంది. కాలనీ సంక్షేమ సంఘాలు, యువజన సంఘాలు, అపార్ట్‌మెంట్ల వాసులు, ఆయా సంస్థలలో గణనాథుడిని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ, వెరైటీ విగ్రహాలు, సినిమా సెట్టింగులను తలపించే మండపాలు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే పర్యావరణహితంగా గణపతి ఉత్సవాలు జరుపుకోవాలని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారైన భారీ గణపతి విగ్రహాలను పోటీపడి ప్రతిష్టిస్తుంటారు. అయితే పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను ప్రతిష్ఠించవద్దని పర్యావరణ ప్రేమికులు, బాధ్యతగల అధికారులు సెలవిస్తున్నారు. రసాయనిక రంగులతో కూడిన విగ్రహాలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తే ఆ నీరు కలుషితం అవుతుందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఉత్సవాల నిర్వాహకుల్లో చాలా మార్పు వచ్చిందని, 50 శాతం మండపాలలో మట్టి విగ్రహాలనే ప్రతిష్టిస్తున్నారని చెబుతున్నారు. నగరంలో అతి పెద్దదైన ఖైరతాబాద్ గణపతిని కూడా మట్టితో చేయించడం శుభ పరిణామమని వారు పేర్కొంటున్నారు.



మట్టి గణపతికి జై కొడుతున్న మహిళలు

4 అంగుళాల నుంచి 7 అడుగుల వరకు..

వనస్థలిపురంలోని జాగృతి అభ్యుదయ సంఘం గత 16 సంవత్సరాలుగా పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతోంది. ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించి ప్లాస్టిక్ కవర్లకు బదులు బట్ట సంచులు వాడాలని ప్రజల్లో అవగాహన కలిగిస్తోంది. అలాగే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించాలని అలుపెరుగని ప్రయత్నం చేస్తోంది. పాఠశాలల విద్యార్థులకు మట్టి గణపతి విగ్రహం తయారుచేసే శిక్షణను అందజేస్తోంది. జీహెచ్‌ఎంసీ సహకారంతో ఈస్ట్ జోన్ పరిధిలో మొట్టమొదటగా ఒక్క రూపాయికే పర్యావరణ గణపతి ప్రతిమల పంపిణీ ప్రారంభించింది. వనస్థలిపురంలోని రామాలయం ప్రాంగణం కేంద్రంగా మట్టి విగ్రహాలను అందుబాటు ధరల్లో మండప నిర్వాహకులు, అపార్ట్‌మెంట్ వాసులకు అందజేస్తోంది. 4 అంగుళాల నుంచి 7 అడుగుల విగ్రహాలు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ తెలిపారు. కావాల్సిన వారు 8686259007 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది వినాయక చవితి పండుగ సందర్భంగా 7వ తేదీన వనస్థలిపురం గణేష్ దేవాలయం సమీపంలో రూ.1 కే గణపతి ప్రతిమలను పంపిణీ చేయనున్నట్లు భావన శ్రీనివాస్ తెలిపారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమోటా రూ.21, వంకాయ రూ.23, బెండ రూ.28, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.50, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.44, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.13, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.65, అర్వి రూ.40, మునగ రూ.28, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్ రూ.28, కీర రూ.23, బీన్స్ రూ.95, క్యాప్సికమ్ రూ.50. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

స్వల్పంగా పెరిగిన ఉల్లి ధర

చాదర్‌ఘాట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉల్లిధర కిలో రూ. 2 నుంచి 3 వరకు పెరిగినట్లు వ్యవసాయ మార్కెట్ అధికారులు తెలిపారు. వారం రోజుల క్రితం ప్రతిరోజు దాదాపు 30 వేల బస్తాలు వివిధ రాష్ట్రాల నుంచి మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌కు దిగుమతి అయ్యాయని, ఇప్పుడు 20 వేల బస్తాలు మాత్రమే దిగుమతి అవుతున్నాయన్నారు. కిలో ఉల్లి మార్కెట్‌లో రూ. 45 నుంచి 47 వరకు ఉండగా, రిటైల్‌గా రూ. 50 నుంచి 52 కు అమ్ముతున్నట్లు తెలిపారు. కొన్నిరోజులు మాత్రమే ఈ ధరలు ఉంటాయని మళ్లీ తిరిగి యథాస్థితికి వస్తాయన్నారు.